క్లుప్తంగా

పర్యావరణ రక్షణ సమష్టి బాధ్యత



పర్యావరణ రక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్లు

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణకూ అందరూ భాగస్వాములు కావాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ దూడ ఆశరేఖ, అర్చన, మధుమోహన్ అన్నారు. రాష్ట్ర సిల్వి కల్చరిస్ట్ షేక్ సలాం ఆదేశాల మేరకు ప్రాంతీయ అటవీ పరిశోధనా సంస్థ రివిజనల్ ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్ అధ్వర్యంలో ఆదివారం ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ సమీపంలో వాల్మర్ ఇండియా ప్రైవేట్ సంస్థ (బెస్ట్‌ప్రైస్)లో పర్యావరణ పరిరక్షణపై మొక్కలు నాటడం – సంరక్షించడం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్టు బీట్ ఆఫీసర్లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిచోటా మొక్కలు నాటి పెంచాలన్నారు. ప్లాస్టిక్ ఎక్కువగా వాడడం వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. తద్వారా పర్యావరణానికి ఆటంకం కలుగుతుందని, భావితరాలకు భూగర్భ జలాల లభ్యత చేకూరదన్నారు. కార్యక్రమంలో బెస్ట్ ప్రైస్ మేనేజర్ మనీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వర్క్‌షాప్‌నకు కృష్ణమోహన్


కృష్ణమోహన్

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వరహాగిరి కృష్ణమోహన్ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి వర్క్ షాప్‌నకు ఎంపికయ్యారు. ఆ వివరాలను ఆయన ఆదివారం వెల్లడించారు. ఈనెల 30, 31 తేదీల్లో ఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్(సీసీఆర్‌టీ) ప్రధాన కేంద్ర కార్యాలయంలో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుల కథలను నిక్షిప్తం చేసే జాతీయ వర్క్ షాప్‌లో పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ కుమార్ నుంచి వర్తమానం అందన్నారు. కాగా.. కృష్ణ మోహన్ ఎంపికపై జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎం.తిరుమలదాస్, అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్పీ జయంతి శాస్త్రి అభినందించారు.

ఉద్యోగం పేరుతో రూ.10 లక్షలకు టోకరా

కంబాలచెరువు: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.10 లక్షలు తీసుకున్న వ్యక్తులపై స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. లక్ష్మీవారపుపేటకు చెందిన పి.సత్యశివకుమార్‌కు 2019లో పీఅండ్ కాలనీకి చెందిన ఆదినారాయణరెడ్డి, కాకినాడకు చెందిన సుంకర బాబీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పారు. దీనికి గాను సత్యశివకుమార్ నుంచి రూ.10 లక్షలు తీసుకున్నారు. అయితే ఉద్యోగం ఇప్పించకపోగా, ఇచ్చిన సొమ్ములు తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

రంగంపేట: మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తహసీల్దార్ వాకాడ అమ్మాజీ హెచ్చరించారు. రంగంపేట మండలం ఈలకొలనులో సర్వే నంబర్ 339లో 0.79 సెంట్ల విస్తీర్ణం గల భూమి ఉంది. ఇందులో ఎల్.వెంకన్న ఎటువంటి అనుమతులు పొందకుండా అక్రమంగా మట్టి తరలించి మెరక చేశారని, దీనిపై ఫిర్యాదు అందడంతో పరిశీలించామని తహసీల్దార్ తెలిపారు. అనుమతులు పొందకుండా మట్టి తరలించి మెరక చేసిన విషయం వాస్తవమేనని వీఆర్వో ఇచ్చిన రిపోర్టు మేరకు కన్వర్షన్ చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 51,300తో పాటు మరో రూ.51,300 ఫెనాల్టీ కట్టాలని భూమి ఆసామికి నోటీసులు జారీ చేశామన్నారు. దీంతో పాటు మైనింగ్ అధికారులకు, ఆర్డీఓకు సమాచారం ఇచ్చామని ఆమె తెలిపారు.

పంచాయతీ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పెదపూడి: రామేశ్వరం వెంకన్నబాబు గుడి వీధిలో పంచాయతీ స్థలాన్ని కొంతమంది ఆక్రమించారంటూ ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి టి.అచ్చిరాజు ఫిర్యాదు చేశారని ఎస్సై పి.వాసు తెలిపారు. ఆ గ్రామంలో సుమారు ఎకరం 50 సెంట్ల పంచాయతీ స్థలం ఉందన్నారు. దానిని ఈ నెల 27న గ్రామానికి చెందిన కొంతమంది జేసీబీ సహాయంతో ఆక్రమణకు పాల్పడుతూ చెట్లను తొలగించారన్నారు. ఆ విషయం తెలుసుకుని అక్కడకు వెళ్లిన కార్యదర్శి అచ్చిరాజును బెదిరించినట్లు ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం

- ఆదర్శంగా నిలుస్తున్న ధవళేశ్వరం పీహెచ్‌సీ
- ప్రతి రోజూ సుమారు 200 మందికి ఓపీ
- నెరవేరుతున్న ప్రభుత్వ లక్ష్యం



ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ధవళేశ్వరం: కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందుతున్నాయి. పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులో భాగంగా ధవళేశ్వరం పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. తద్వారా ఓపీ పెరుగుతూ వస్తోంది. ధవళేశ్వరంలో ప్రతి రోజూ సుమారు 200 మందికి సేవలందిస్తున్నారు. వైద్యసేవలు అందించడంతో పాటు రోగులతో మర్యాదగా మెలుగుతూ సిబ్బంది మన్ననలు అందుకుంటున్నారు. గత ఏడాది ధవళేశ్వరం పీహెచ్‌సీ జిల్లా ఉత్తమ పీహెచ్‌సీగా కూడా అవార్డు పొందింది. రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్న మిగిలిన పీహెచ్‌సీలకు ఆదర్శంగా నిలుస్తోంది.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ

గర్భిణులు, బాలింతలపై ధవళేశ్వరం పీహెచ్‌సీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గర్భిణులు తీసుకునే ఆహారం నుంచి బిడ్డ పుట్టే వరకూ ఆహార నియమాలు, జాగ్రత్తలను వివరిస్తున్నారు. బాలింతలు తీసుకునే ఆహారాలను వివరిస్తూ బిడ్డకు తల్లిపాల ద్వారానే పూర్తి పౌష్టికాహారం లభిస్తుందని వివరిస్తున్నారు. ప్రతినెలా సుమారు 30 మందికి ఇక్కడ కాన్పులు జరుగుతున్నాయి.

స్పెషలిస్టు డాక్టర్ల సేవలు

ధవళేశ్వరం పీహెచ్‌సీలో పేదలకు అందుబాటులో స్పెషలిస్ట్ డాక్టర్లు సేవలందిస్తున్నారు. ప్రతి మంగళవారం ప్రసూతి డాక్టర్ అందుబాటులో ఉంటున్నారు. ప్రతి గురువారం ఊపిరితిత్తులు, ఎముకలు వైద్యులు వస్తున్నారు. ప్రతినెలా మూడో సోమవారం మానసిక వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీలో రక్తం, మూత్రం, కళ్లె పరీక్షలు నిర్వహిస్తున్నారు.

టీబీ నివారణకు..

ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీపై ప్రత్యేక దృష్టి సారించారు. టీబీ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న కిట్లను ఇస్తూ వారిని వ్యాధి నుంచి దూరం చేస్తున్నారు. మిగతా వారికి సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నారు.

పీహెచ్‌సీ పరిధిలో 17 సబ్ సెంటర్లు

ధవళేశ్వరం పీహెచ్‌సీ పరిధిలో 17 సబ్ సెంటర్ల ద్వారా రూరల్ మండలంలో సుమారు 1.90 లక్షల మందికి సేవలందిస్తున్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీలో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచారు. పీహెచ్‌సీ సిబ్బందితో పాటు ఆశ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పేదలకు వైద్యసేవలు అందిస్తున్నారు.

సమష్టి కృషి



సమష్టి కృషితోనే ధవళేశ్వరం పీహెచ్‌సీ ద్వారా రోగులకు సేవలందించగలుగుతున్నాం. క్షేత్ర స్థాయిలో సిబ్బంది రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ డాక్టర్లు సైతం సేవలందిస్తున్నారు.

– కె.సుధాకర్, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

అలరించిన సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయకులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక విక్రమ్ హాల్లో ఆదివారం సాయంత్రం సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని శ్రీహరి ఈవెంట్స్ ఆధ్వర్యంలో కృష్ణ సినిమా గీతాలతో నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. గాయకులు శ్రీహరి, శ్రీదేవి, చౌదరి, భవ్య, రాజేశ్వరరావు తదితరులు సూపర్‌స్టార్ కృష్ణ హిట్ చిత్రాల్లోని పాటలు ఆలపించారు. ఆ పాటలకు అభిమానులు డ్యాన్స్ చేసి అలరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ, కృష్ణ అభిమాని ఆసూరి సుధాకరరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- టీడీపీ నాయకుల ప్రోత్సాహంతోనే ఈ పని
- ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు


దుండగులు ధ్వంసం చేసిన ఫ్లెక్సీ

రాజమహేంద్రవరం రూరల్: నగరంలో చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ సీఎం జగన్, వైఎస్సార్ సీపీ ఎంపీ భరత్ చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తెలుగుదేశం పార్టీ దుండగులు ధ్వంసం చేశారని జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్ రెడ్డికి వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి నేతృత్వంలో నాయకులు ఫిర్యాదు చేశారు. ఆదివారం బొమ్మూరు పోలీసు స్టేషన్‌లో ఎస్పీని కలిశారు. అడపా శ్రీహరి మాట్లాడుతూ శనివారం రాత్రి 1.30 గంట సమయంలో బొమ్మూరు జంక్షన్ వద్ద నంబర్ లేని ఒక వాహనంలో వచ్చిన కొందరు ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు తెలిపారు. అదే సమయంలో అటుగా వెళుతున్న తమ పార్టీ కార్యకర్తలు ఎందుకు ధ్వంసం చేస్తున్నారని వారిని ప్రశ్నించారన్నారు. పెట్రోల్ బంకులో వాహనం పెట్టి అక్కడ నుంచి ఒక గుంపుగా దుండగులు బయల్దేరి ఫ్లెక్సీలను ధ్వంసం చేశారని, సీసీ ఫుటేజీలు పరిశీలిస్తే విషయం తెలుస్తుందన్నారు. ఫ్లెక్సీలు ధ్వంసం చేసేటప్పుడు తమ పార్టీకి చెందిన వారు మొబైల్‌లో చిత్రీకరించారన్నారు. అందుకు సంబంధించిన దృశ్యాలను కూడా ఎస్పీకి అడపా శ్రీహరి చూపించారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ సమగ్ర దర్యాప్తు చేసి, తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా శ్రీనగేష్, పాలిక శ్రీను, మహ్మద్ ఆరిఫ్, ఎస్వీ శ్రీనివాస్, మార్తి లక్ష్మి, కొత్త విజయ రాజ్యలక్ష్మి, బర్రే కొండబాబు, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, పీతా రామకృష్ణ, అరిగెల బాబు, దుంగా మంగాలక్ష్మి, బిల్డర్ చిన్నా పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం


కృష్ణానగర్‌లో మునిగిన రహదారి

సీటీఆర్ఐ: ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలను ఆదివారం వరుణదేవుడు కరుణించాడు. ఉదయం నుంచే భానుడు ప్రతాపంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. చిన్నారులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడ్డారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆకాశంలో మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లగా మారింది. క్రమంగా ఉరుములు, మెరుపులతో వాన దంచి కొట్టింది. లాలాచెరువు, క్వారీమార్కెట్ సెంటర్, ఆర్యాపురం, ఆనంద్ నగర్, తుమ్మలావ, వెంకటేశ్వర నగర్, తాడితోట ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి పొర్లాయి.

ఈదురు గాలులు

కడియం: రోహిణీ కార్తె ప్రభావంతో రోజురోజుకూ ఎండ తీవ్రమైపోతోంది. ఆదివారం కూడా ఉదయం నుంచే ఎండ తీవ్రత ప్రజలను బెంబేలెత్తించింది. అయితే సాయంత్రం ఐదు గంటల సమయానికి మబ్బులు కమ్మేశాయి. ఉరుములతో కూడిన భారీ వర్షం ముంచెత్తింది. కాగా ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రాజానగరం మండలంలో..

రాజానగరం: ఎండ మండిపోతున్న వేళ ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి కురిసిన వర్షానికి జనజీవనం ఎక్కడికక్కడే స్తంభించింది. పల్లపు ప్రాంతాలు, కొన్నిచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. పల్ల కడియం, కానవరం, నందరాడ, నరేంద్రపురం, కలవచర్ల, సీతారామపురం, దివాన్‌చెరువు, శ్రీరామపురాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీనితో సుమారు 4 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏఈ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటీన ఆయా ప్రాంతాలకు చేరుకుని, విద్యుత్ తీగలపై పడిన కొమ్మలను తొలగించి, సరఫరాను పునరుద్ధరించారు.


దండుకోవడమే ఆదిరెడ్డి వాసు నైజం



విలేకరులతో మాట్లాడుతున్న పాలిక శ్రీను, నక్కా శ్రీ నగేష్

రాజమహేంద్రవరం రూరల్: ఎంతసేపు దండుకోవడమే టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు నైజమని రాష్ట్ర గౌడ శెట్టిబలిజ ఈడిగ శ్రీశయన యాత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం బొమ్మూరు పోలీస్‌స్టేషన్ బయట విలేకరులతో మాట్లాడారు. ఆదిరెడ్డి వాసు టీడీపీ ముసుగులో చేసే అన్యాయాలు అందరికీ తెలుసునన్నారు. నగరంలో శిష్టా రోహిత్ నుంచి బ్యానర్లు, ఫ్లెక్సీల కోసం రమారమి రూ.30 లక్షలు గుంజారని, లేదని వాసు ఏ గుడిలోనైనా ప్రమాణం చేయగలరా అని సూటిగా ప్రశ్నించారు. చీటీల మోసం కేసులో జైలుకు వెళ్లి వచ్చిన వాసు.. ఇకనైనా న్యాయంగా మెలగాలని హితవు పలికారు. ఎంపీ టికెట్ కోసం యత్నిస్తున్న శిష్టా రోహిత్ దగ్గర రూ.లక్షలు తీసుకున్న విషయం మహానాడులో నాయకుల వద్ద ప్రస్తావనకు వచ్చిన విషయం తెలియదా అన్ని ప్రశ్నించారు. నగరంలో సీఎం జగన్, ఎంపీ భరత్ ఫ్లెక్సీల ధ్వంసంలో ఆదిరెడ్డి వాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హస్తం ఉందని పాలిక శ్రీను, నక్కా శ్రీనగేష్ ఆరోపించారు. బేషరతుగా క్షమాపణ చెప్పకుంటే వాసు, గోరంట్ల ఇళ్లను ముట్టడి చేసి, ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గ్యాస్ సిలిండర్ లారీల నిలిపివేత



హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ వద్ద నిలిపి ఉంచిన లారీలు

గోకవరం: వీరలంకపల్లి గ్రామ శివారున హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ సమీపంలో జాతీయ రహదారి వద్ద గ్యాస్ సిలిండర్లు సరఫర చేసే లారీలను నిలిపివేయడంతో దారి ఇరుకుగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ప్లాంట్‌కు నిత్యం వందల సంఖ్యలో లారీలు గ్యాస్‌ను వివిధ ప్రాంతాలకు రవాణా చేయడానికి వస్తుంటాయి. ఆ లారీలకు కేటాయించిన స్థలంలో కాకుండా డ్రైవర్లకు జాతీయ రహదారి పక్కన నిలిపివేస్తున్నారు. ఇది ప్రమాదకరమే కాకుండా రహదారి ఇరుకుగా మారుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి రహదారి చెంత లారీలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


సాయిబాబాను దర్శించుకున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మితోపాటు రాజానగరం, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి బాబాను దర్శించుకున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 8.30 గంటలకు సాయిబాబా ఉత్సవ విగ్రహానికి స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్ కుటుంబ సభ్యులతో వివిధ రకాల పండ్ల రసాలతో పాటు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అఖండ బిల్వార్చన జరిగింది. తొలుత అదే ప్రాంగణంలో కొలువైన గణపతి, దత్తాత్రేయుడు, సరస్వతీమాత, అభయ ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్న హారతి తరువాత అన్నసమారాధన నిర్వహించారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం


బుచ్చెంపేటలో ఆర్బీకేను ప్రారంభించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బుచ్చెంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బుచ్చెంపేటలో ఆదివారం రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ బుచ్చెంపేటలోని 3,431 మంది లబ్ధిదారులకు రూ.9.50 కోట్లు వెచ్చించి సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ పాతూరు విఘ్నేశ్వరుని ఆలయం నుంచి శివాలయం వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 220 గడపలు తిరిగారు. ఆయనకు అక్కచెల్లెమ్మలు హారతులిచ్చి ఆహ్వానం పలికారు. మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

ఆర్బీకే భవనం ప్రారంభం

రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే నూతన భవనాన్ని ఎమ్మెల్యే రాజా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దళారుల మోసాలకు గురి కాకుండా ఉండటానికి, విత్తనాలు, ఎరువులను అందజేయడానికి ఆర్బీకేలు ఉపయోగపడతాయన్నారు. విత్తనాలను పరీక్షించడానికి మండల కేంద్రాల్లో ల్యాబ్‌లను నిర్మించామన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు, బుచ్చెంపేట సర్పంచ్ తాడేపల్లి జ్యోతి, ఎంపీటీసీ తాడేపల్లి మేరీ, వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల గొల్లబాబు, మద్దాల చంటిబాబు, నల్రావుల బాలాజీ, సచివాలయం సెక్రటరీ కె.శాంతి ప్రసన్న పాల్గొన్నారు.

మానవతా విలువలతో మెరుగైన సమాజం



నృత్యాభినయం చేస్తున్న చిన్నారులు

- వాటిని విద్యార్థులకు అలవర్చడమే లక్ష్యం
- రామకృష్ణ మఠంలో వేసవి తరగతులు



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న స్వామి పరిజ్ఞేయానంద

సీటీఆర్ఐ: క్రమశిక్షణ, మానవతా విలువలతో పాటు మంచి చేయి, మంచిగా ఉండు అనే నినాదాన్ని విద్యార్థులకు అలవరచడానికి రామకృష్ణ మఠం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రతి వేసవి సెలవులలో వివేకానంద బాల వికాస కేంద్రంలో వివిధ విభాగాలలో శిక్షణ ఇస్తోంది. గత 20 ఏళ్లుగా ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణను తల్లిదండ్రుల నుంచే అలవాటు చేయాలన్నదే ఉద్దేశం. ఇందులో భాగంగా మే ఒకటి నుంచి 28వ తేదీ వరకూ కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిబిరంలో 355 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిని ప్రహ్లాద, నచికేత, నరేంద్ర అనే మూడు గ్రూపులుగా విభజించారు. ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11.15 గంటల వరకూ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులలో పారాయణ, భజనలు, ధ్యానం, యోగాసనాలు, సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, నాటకం, హస్తకళలు, కంప్యూటర్ బేసిక్స్, మహాపురుషులు జీవిత కథలు, వ్యక్తిత్వ వికాసం మొదలగు వాటిలో శిక్షణ ఇచ్చారు. ఈ తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. స్వామి పరిజ్ఞేయానంద, స్వామి వేదవిద్యానంద, స్వామి రఘువీరానంద, స్వామి సేవ్యానంద, స్వామి ప్రజ్ఞానాధానంద, డాక్టర్ పీవీ రమణ తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మానవతా విలువలు నేర్పించాలి

నైతిక విలువల, క్రమశిక్షణ తల్లిదండ్రుల నుంచే అలవడాలి. పిల్లలకు వారి పనులు వారే చేసుకునే అలవాటు చేయాలి. ఒకరికొకరు సాయం చేసుకునే అలవాటు నేర్పించాలి. తెలివితేటల కన్నా మానవతా విలువల ప్రాముఖ్యతను వివరించాలి. అప్పుడే వారికి మన సంస్కృతి, సంప్రదాయాలపై గౌరవం పెరుగుతుంది.

– స్వామి పరిజ్ఞేయానంద, రామకృష్ణ మఠం నగర శాఖ అధ్యక్షుడు

ఎన్టీఆర్‌కు నివాళి

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. వేమగిరి, కడియం, మురమండ, దుళ్ల, బుర్రిలంక తదితర గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని పాలచర్ల రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంకుపై నుంచి కిందకు దూకి కడలి సత్యవేణి (27) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కోరుకొండ ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపిన వివరాల మేరకు.. రాజానగరం మండలం పల్ల కడియం గ్రామానికి చెందిన సత్యవేణికి గాడాల చెందిన మల్లికార్జునరావుతో వివాహమైంది. అదనపు కట్నం కోసం కొంతకాలంగా భర్త, అత్తమామలు వేధిస్తున్నారు. వాటిని భరించలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

రంగంపేట: ఉపాధి పనులపై సోమవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రంగంపేట మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఈ నెల 29 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకూ సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు.

సినిమాలు



శ్యామల	: అన్ని మంచిశకునాలే
సూర్యమినీ	: మెన్‌టూ
సూర్యప్యాలెస్	: నేను ఫేమస్
స్వామి	: బిచ్చగాడు–2
శివజ్యోతి	: కస్టడీ
అనుశ్రీ	: విరూపాక్ష
రాజా	: బిచ్చగాడు–2
అశోక	: మళ్లీపెళ్లి
ఊర్వశి	: ఎలియన్స్2042
రంభ	: ది కేరళస్టోరీ
మేనక	: రామబాణం, ఉగ్రం
అప్సర	: 2018
నామవరం	
వీఎస్ మహల్	: 2018
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: 2018
కడియం	
వెంకటసూర్య	: బిచ్చగాడు–2